సాక్షి చిత్తూరు
బుధవారం । 25 । అక్టోబర్ । 2023



పునీతం..పుణ్యస్నానం

తుమ్మలగుంట కల్యాణ వెంకన్న బ్రహ్మోత్స వాల్లో చివరిరోజు చక్రస్నానం వైభవంగా జరిగింది.

- 8లో



శాస్త్రోక్తంగా శమీ పూజలు

కాణిపాకం మరగదాంబిక ఆలయంలో మంగళవారం జమ్మిచెట్టు పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	21
తిరుపతి	36	22
తిరుమల	32	18
గూడూరు	37	23
నగరి	36	22

న్యూస్‌రీల్

అమ్మా..భవానీ



రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా చివరిరోజు సోమవారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవిగా భక్తులకు అభయం ఇచ్చారు. ఉదయం ఆలయంలోని మూలవర్లను విశేష పూజల అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించారు. విజయ దశమి కావడంతో అశేషంగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే అమ్మవారి ఉత్సవమూర్తికి కూడా ప్రత్యేక పూజలు చేసి పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో శ్రీరాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. గణపతి పూజ, ఊంజల్‌సేవ, గణపతిహోమం, చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పోలీసుశాఖలో ఆయుధ పూజ



హారతి ఇస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసుశాఖ ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయంలో మంగళవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి, పలువురు అధికారులు ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేకంగా పూజించారు. పోలీసుశాఖ ఉపయోగించే ఆయుధాలు, కార్లు, ద్విచక్ర వాహనాలకు ఎస్పీ పూజలు చేశారు. అలాగే పోలీసు క్యాంటీన్, వ్యాయామశాల, అసోసియేషన్ కార్యాలయాల్లో సైతం పూజలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి నాందీగా విజయదశమి నిర్వహిస్తారని తెలిపారు. అన్ని పరిస్థితుల్లో పోలీసులు ఆత్మస్థైర్యంతో పనిచేయాలని సూచించారు. ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, డీఎస్పీలు బాబుప్రసాద్, విష్ణు రఘువీర్, శ్రావణ్‌కుమార్, మురళీధర్, ఆర్‌ఐ మధు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యుడిగా రమణ



చిత్తూరు కలెక్టరేట్ : పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌ల తనిఖీకి ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందంలో సభ్యుడిగా జిల్లా సైన్స్ ఆఫీసర్ ఆర్.వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నిర్వహించే టాస్క్‌ఫోర్స్ బృంద తనిఖీల్లో ఆయన పాల్గొంటారు.

సీజనల్ వ్యాధులపై అపోహలు వద్దు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవిరాజు

కార్వేటినగరం: సీజనల్ వ్యాధులపై అపోహలు వీడాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని రాజులకండ్రిగ దళితవాడను సందర్శించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు వస్తుంటాయని, అలాంటి జ్వరాలపై అపోహలు చెందాల్సిన అవసరం లేదన్నారు. జ్వరం వచ్చినప్పుడు కీళ్ల వాపు, కాళ్లు చేతులు వాపు రావడం సహజమని, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.



శ్రీవారి పుష్కరిణిలో అశేష భక్తజనం (ఇన్‌సెట్) విశేషాలంకరణలో దేవదేవేరులు, చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు, తిరుమంజనసేవ అనంతరం మలయప్పస్వామి, చక్రత్తాళ్వార్

పవిత్రం.. పరిపూర్ణం

- తిరుమలలో శాస్త్రోక్తంగా చక్రస్నానం
- దేవదేవేరులు.. చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం
- భారీగా పాల్గొన్న భక్తజనం
- శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



ఉభయదేవేరులతో శ్రీవారు

బ్రహ్మోత్సవ వేళ తిరుగిరులు అల వైకుంఠాన్ని తలపించాయి.. ఆధ్యాత్మిక వైభవాన్ని ఇనుమడింపజేస్తూ సకల జనులను భక్తిపారవశ్యంలో ఓలలాడించాయి.. స్నపన తిరుమంజసేవలో ఉభయదేవేరీ సమేత మలయప్పతోపాటు మహిమాన్విత చక్రత్తాళ్వార్‌ను అభిషేకించి విశేష ద్రవ్యాలు పరమ పావనమయ్యాయి. వేదపండితులు పఠించిన పాశురాల శ్రవణంతో భక్తుల హృదయాలు పులకించాయి. సుగంధ సుమాల అలంకరణలో దేవదేవేరుల దివ్యతేజస్సును వీక్షించి తన్మయత్వం చెందాయి. చక్రస్నాన ఘట్టంలో భాగంగా పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరించి పునీతమయ్యాయి.

తిరుమల : శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం చక్రస్నానంతో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా వేకువనే స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. భూవరాహస్వామి ఆలయం ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి దంపతులు, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్‌ఓ నరసింహకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారికి హారతి సమర్పణ



పల్లకీసేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి







పుణ్యస్నానమాచరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, సీవీఎస్‌ఓ నరసింహకిషోర్, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

నేటి నుంచి రుద్ర పాదాల ముక్కోటి ఉత్సవాలు

చంద్రగిరి: మండలంలోని తొండవాడ సమీపంలోని స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన శ్రీఅగస్తీశ్వర స్వామివారి రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలను వేడుకగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు భూమి పూజతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా ముక్కోటి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. ముక్కోటి ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులు సౌకర్యార్థం ప్రసాదాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, వాహన సేవలు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. గురువారం గణపతి పూజ, అంకుర్పారణ, రాత్రి సింహ వాహనం, శుక్రవారం ఉదయం శేషవాహనం, రాత్రి భూత వాహనం, 28వ తేదీ పౌర్ణమి సందర్భంగా రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 3.30 నుంచి 5 గంటల మధ్య నంది వాహన సేవను నిర్వహిస్తామని, ఆపై చంద్రగ్రహణం కారణంగా 5గంటలకు ఆలయాన్ని మూసివేస్తామని తెలిపారు. 29న కల్యాణోత్సం, 30న స్వామి, అమ్మవార్ల ఊరేగింపు, 31న రథోత్సవం, నవంబర్ 1వ తేదీన పూలంగి సేవ, మూషిక వాహనం, అధికారి నంది వాహనం, 2న త్రిశూల స్నానంతో ఉత్సవాలు పరిసమాప్తి కానున్నట్లు తెలిపారు.



శ్రీఅగస్తీశ్వర స్వామివారు

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో పది కంపార్ట్‌మెంట్లు నిండాయి. మగళవారం అర్ధరాత్రి వరకు 70,693 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కల్యాణకట్టలో 21,864 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.33 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

జాతీయ స్థాయిలో క్రీడా ఖ్యాతి నిలపాలి

- బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర పోటీల ట్రోఫీల ప్రదానంలో మంత్రి ఆర్కేరోజా
- చాంపియన్‌గా నిలిచిన విశాఖ



చాంపియన్‌గా నిలిచిన విశాఖ బాల,బాలికలజట్లకు ట్రోఫీని అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : జాతీయ స్థాయిలో రాష్ట్ర బాల్ బాడ్మింటన్ జట్టు చాంపియన్ కావాలని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా ఆకాంక్షించారు. పట్టణంలోని కేవీకే మైదానంలో జరిగిన మూడు రోజుల 8వ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ బాల, బాలికల చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. 13 జిల్లాల బాల, బాలికల జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు జరిగాయి. విజేతలకు మంగళవారం మంత్రి ట్రోఫీలు బహూకరించారు. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్‌గా నిలిచిన విశాఖ జట్టుకు, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచిన తూర్పుగోదావరి, ప్రకాశం, కర్నూలు జట్లకు, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్‌గా నిలిచిన విశాఖ జట్టుకు, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచిన శ్రీకాకుళం, తూర్పుగోదావరి, గుంటూరు జట్లకు ఆమె ట్రోఫీలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటి చాంపియన్లుగా నిలవాలని కోరారు.

క్రీడలకు ప్రోత్సాహం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడా రంగానికి పెద్దపీట వేస్తున్నారని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన అనంతరం ఎన్నో టోర్నమెంట్లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ నుంచి ఆడుదాం ఆంధ్రాతో రాష్ట్రమంతా క్రీడా సంబరాలకు సిద్ధంగా ఉందని తెలిపారు. బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్తరాంధ్ర జట్లు ట్రోఫీలను కైవసం చేసుకున్నాయని పేర్కొన్నారు. సీఎం జగనన్న ఎప్పుడు పరిపాలనా రాజధాని వైజాగ్ అన్నారో అప్పటి నుంచి వారు ఎందులోను తగ్గడం లేదని చమత్కరించారు. క్రీడలు మెడల్స్‌తో పాటు ఉద్యోగాన్ని, గౌరవాన్ని తెచ్చిపెడుతాయన్నారు. క్రీడాకారులకు తన వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయశంకర్ రెడ్డి, వెంకటరావ్, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, నగరి, నిండ్ర ఎంపీపీలు భార్గవి, దీప, వైస్ ఎంపీపీ బాలాజీ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

బాలుర విభాగం : వరప్రసాద్, హేమకుమార్, కల్యాణ్‌రాజు (విశాఖ), స్వామి, శివప్రకాష్ (ఈస్ట్ గోదావరి), వినయ్ (ప్రకాశం), హుస్సేన్‌బాషా (కర్నూలు), శ్రీను (కృష్ణా) షేక్‌మొహమ్మద్ ముస్తాక్(కడప), భానుప్రకాష్ (చిత్తూరు)

బాలికల విభాగం: రాధాసరస్వతి, హైమావతి, ప్రజ్ఞా సుహాసిని (విశాఖ), గాయత్రి, నందిని (శ్రీకాకుళం), శిరీష, బిందుశ్రీ (ఈస్ట్‌గోదావరి),బసవరాణి (గుంటూరు), శ్రీలేఖ (కృష్ణా), శశికళ (చిత్తూరు).

సృజనకు పదును

- ప్రయోగాల్లో జాతీయస్థాయిలో విద్యార్థుల మెరుపులు
- సైన్స్ ల్యాబ్‌లను బలోపేతం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- నూతన ఆవిష్కరణలకు సై అంటున్న విద్యార్థులు
- ల్యాబ్‌ల తనిఖీకి టాస్క్‌ఫోర్స్ బృందం ఏర్పాటు

- గుడిపాల మండలం ఏఎల్‌పురం జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ప్రణయ,అన్నమయ్య జిల్లా పీలేరు మండలం జంగంపల్లె హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న చరణ్‌తేజ్ తమదైన శైలిలో నూతన సైన్స్ ప్రాజెక్టులను కనిపెట్టారు. ఆ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఎంపికై నవంబర్ 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జపాన్ దేశంలో నిర్వహించే అంతర్జాతీయ ఇన్‌స్పైర్ పోటీలకు హాజరుకానున్నారు.
- జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదివే ఆకాశ్ ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి మిల్లెట్స్ సెమినార్‌లో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించాడు.

వీరితో పాటు జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైన్స్ ప్రయోగాల పట్ల ఆసక్తి చూపి ప్రతిభ చాటుతున్నారు. బాల శాస్త్రవేత్తలు భళా అనిపించుకుంటున్నారు. ఈనేపథ్యంలో ల్యాబ్‌ల తనిఖీకి ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసింది.

చిత్తూరు కలెక్టరేట్ : గతంలో ఏన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ సర్కారు విద్యాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధి కోసం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల దశ నుంచే సైన్స్‌పై ఆసక్తి కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. శాస్త్ర సాంకేతిక అభివృద్ధిలో సర్కారు బడుల విద్యార్థులు రాణించేలా తోడ్పాటునందిస్తోంది. సాంకేతికతకు తగ్గట్టుగా ప్రదర్శనలు చేసేలా సైన్స్ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని భావించిన ప్రభుత్వం సైన్స్‌ల్యాబ్‌ల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది. జిల్లాలోని సర్కారు బడులు, ఇతర యాజమాన్య పాఠశాలల్లో అమలవుతున్న సైన్స్ ల్యాబ్‌ల అమలు తీరును పరిశీలించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లాకు రానుంది.



కీలపట్ల హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రయోగాలు నేర్పిస్తున్న ఉపాధ్యాయురాలు

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు

జిల్లాలోని సర్కారు బడుల్లో ల్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా 287 ప్రాథమికోన్నత, 515 ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 1,51,143 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు ఈ నెల 30, 31, నవంబర్ 1వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారు. ల్యాబ్‌ల నిర్వహణ, ఉపయోగిస్తున్న తీరు, ల్యాబ్ రికార్డుల అమలు పరిశీలించనున్నారు. జనరల్ ల్యాబ్స్, అటల్‌టింకరింగ్ ల్యాబ్స్, స్టెమ్ ల్యాబ్స్‌ను టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు పరిశీలించనున్నారు. ఈ మేరకు పాఠశాలల్లో ల్యాబ్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ల్యాబ్‌లు సిద్ధం చేసుకోవాలి..



“జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ల్యాబ్‌లను సిద్ధం చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోంది. సైన్స్ ల్యాబ్‌ల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో ఏన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విలువైన ఐఎఫ్‌పీ ప్యానల్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ల్యాబ్‌లు, డీసీఆర్, వీసీఆర్, ఐఎఫ్‌పీ ప్యానల్స్ పరిశీలించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు జిల్లాలో పర్యటించనున్నారు.

– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

పంటలపై ఏనుగుల దాడి

సదుం: మండలంలోని మారుతివారిపల్లె, గొల్లపల్లె పంట పొలాలపై సోమవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. రైతులు పెద్దరెడ్డెప్ప, చిన్నరెడ్డెప్ప, సుబ్రమణ్యం, నరసింహులు, రమణకు చెందిన వరి, చెరుకు పంటలను తొక్కి నాశనం చేశాయి. మంగళవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు ధ్వంసమై ఉండడం చూసి కన్నీటిపర్యంతమయ్యారు. అటవీశాఖాధికారులు పరిశీలించి పంట నష్టం అంచనా వేసి పరిహారం అందించాలని కోరారు.



గొల్లపల్లెలో ఏనుగులు తొక్కేసిన వరి పంట

క్లుప్తంగా

కాణిపాకంలో శాస్త్రోక్తంగా శమీ పూజలు


దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి అనుబంధ శ్రీమరగదాంబికాదేవి సమేత మణికంఠేశ్వరస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా మంగళవారం శమిపూజలు (జమ్మి పూజలు) శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలుజరిగాయి. అమ్మవారిని దుర్గాదేవిగా విశేషంగా అలంకరించారు. విజయదశమి సందర్భంగా జమ్మిచెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ. వెంకటేశు దంపతులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రి అమ్మవారి ఉత్సవర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

చెట్టును ఢీకొని స్కూటరిస్టు దుర్మరణం

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లె మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు చిత్తూరు లక్ష్మీనగర్‌కాలనీకి చెందిన ఎం.దిలీప్‌కుమార్(41) భార్య ప్రమీల, కుమారులు మోక్షిత్, కౌషల్ ఆదివారం దివిటివారిపల్లెలో బంధువుల ఇంటి వచ్చారు. వారిని తీసుకు వెళ్లేందుకు దిలీప్‌కుమార్ సోమవారం ద్విచక్ర వాహనంలో చిత్తూరు నుంచి దివిటివారి పల్లెకు బయలుదేరాడు. ఈ క్రమంలో 35 యర్లంపల్లె సమీపంలోని మలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దిలీప్‌కుమార్‌ను స్థానికులు 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. బావమరిది నిరంజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పునీతం.. పుణ్యస్నానం


తిరుమంజన సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

- ఘనంగా ముగిసిన తుమ్మలగుంట కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- చక్రస్నానానికి భారీగా తరలి వచ్చిన భక్తులు
- పాల్గొన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు
- ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తం

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన సోమవారం ఉదయం చక్రస్నాన ఘట్టం నిర్వహించారు. కంకణభట్టార్ గిరిధర్ భట్టాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్నతోపాటు సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైభవంగా స్నపన తిరుమంజనం జరిపించారు. అందులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, గంధంతో స్నపనం చేశారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమోక్తంగా స్నపనం చేపట్టారు. ఉపనిషత్తు మంత్రాలు, దశశాంతి మంత్రాలు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రాలు, దివ్యప్రబంధం లోని అభిషేక సమయంలో దేవదేవునికి అనుసంధానం చేసే వేదాలను పారాయణం చేశారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు.

భారీగా తరలివచ్చిన భక్తులు

పవిత్రమైన చక్రస్నానంలో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తుమ్మలగుంటకు తరలివచ్చారు. తెల్లవారుజామునుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉదయం 7 గంటల నుంచి స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. అనంతరం చక్రత్తాళ్వార్‌ను ఆలయ పుష్కరిణికి తీసుకువచ్చారు. ఆ అమృత ఘడియల్లో పుష్కరిణిలో మునిగేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజావరోహణం

సోమవారం సాయంత్రం 5.30 నుంచి 7 గంటల నడుమ ఘనంగా ధ్వజావరోహణం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పరిపూర్ణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నల్లందుల సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.


పుష్కరిణిలో పుణ్యస్నానం చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

సన్యాసి సన్యాసి రాసుకున్నట్లుంది..

- లోకేష్, పవన్ కలయికపై మంత్రి ఆర్కే రోజా విమర్శ


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: 'ఎన్నికల్లో ఓ చోట లోకేష్, రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయిన పవన్ కలసి మీటింగ్ పెడితే ఏమౌతుందీ? సన్యాసి సన్యాసి రాసుకొంటే బూడిద రాలినట్లే' అని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా వ్యాఖ్యానించారు. మంగళవారం సాయంత్రం పుత్తూరు మున్సిపాలిటి దాసరిగుంట సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన ఈ ఇద్దరూ కలిసి రాష్ట్ర భవిషత్ కోసం మేనిఫెస్టో తయారు చేస్తున్నారంటే ఇదేం ఖర్మరా బాబు అంటూ తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులే తలలు పట్టుకొనే పరిస్థితి నెలకొని ఉందన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ మ్యానిఫెస్టోకు తాను గ్యారెంటీ.. అమలు చేయకపోతే ప్రశ్నిస్తానన్న పవన్ ఎందుకు మౌనం దాల్చారని నిలదీశారు. ఇటీవల తాను సీఎం కావడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన పవన్ ఈ రోజు పది సీట్ల కోసం టీడీపీ ముందు భిక్షమెత్తుకొంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రానున్న ఎన్నికల్లో జగన్ వన్స్‌మోర్

తెలుగుదేశం, జనసేన పార్టీలు రెండూ జీరోలని, వీటిని గత ఎన్నికల్లోనే ప్రజలు పక్కకు పెట్టేశారని, రానున్న 2024 ఎన్నికల్లో జగన్ వన్స్‌మోర్ అంటూ ప్రజలు గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని మంత్రి రోజా స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికిపోవడంతోనే చంద్రబాబు జైలులో ఉన్నారని స్పష్టం చేశారు. కోర్టులో నిజం గెలవాలంటున్న భువనేశ్వరి మాటల్లో నిజాయితీ ఉంటే సీబీఐ విచారణ కోరుతూ లెటర్ రాయాలని డిమాండ్ చేశారు. రెండెకరాల భూమిలో ఒక ఎకరా తమ్ముడికి ఇస్తే ఎకరా భూమి కలిగిన చంద్రబాబు ఈరోజు రూ. వేల కోట్లకు ఎలా అధిపతి అయ్యారని ప్రశ్నించారు. భువనేశ్వరి రూ.కోట్లు విలువ చేసే కార్లలో ఎలా తిరుగుతున్నారని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడిన తెలుగుదేశం పార్టీ నాయకులు లోకేష్, అచ్చెంనాయుడు, నారాయణ సైతం జైలుకు వెళ్లడం ఖాయమని తెలిపారు. కోర్టులో నిజం గెలవాలనే తాము కోరుకుంటున్నామని స్పష్టం చేశారు.

ప్రాణాల మీదికి తెచ్చిన అయ్యోరి వడ్డీ వ్యాపారం

- భూమిని రాయించుకుని ఆపై మోసం
- మనస్తాపంతో టీచర్ ఇంటి ముందే బాధితుడు ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చంద్రప్ప

పలమనేరు: ఓ ఉపాధ్యాయుడి వడ్డీ వ్యాపారం ఓ వ్యక్తి ప్రాణాలమీదకు తెచ్చింది. సోమవారం సాయంత్రం పట్టణ సమీపంలోని సాయినగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. బైరెడ్డిపల్లి మండలం మిట్టకురప్పల్లెకు చెందిన చంద్రప్ప(33) గ్రామంలో తన 53 సెంట్ల పొలంలో సేద్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. మూడేళ్ల కిందట చంద్రప్ప భార్య అనారోగ్యానికి గురికావడంతో మిట్టకురప్పల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ టీచర్‌గా పనిచేసే తమ బంధువైన కృష్ణమూర్తి వద్ద తన పొలాన్ని రాసిచ్చి రూ.2 లక్షలను వడ్డీకి తీసుకున్నాడు. ఆపై తీసుకొన్న అప్పు వడ్డీతో కలసి రూ.4లక్షల వరకు పెరిగింది. ఆ డబ్బు మొత్తం చెల్లిస్తే తిరిగి భూమి వెనక్కి రాసిస్తానని టీచర్ చెప్పాడు. దీంతో బాధితుడు రెండేళ్లుగా డబ్బు కడుతానంటూ టీచర్ వద్దకెళ్లినా ఆయన పట్టించుకోలేదు. దీంతో సోమవారం సాయంత్రం బైరెడ్డిపల్లెలో క్రిమిసంహార మందును వెంటబెట్టుకుని స్థానిక సాయినగర్‌లోని టీచర్ ఇంటివద్దకెళ్లి వడ్డీతో కలసి మొత్తం డబ్బు చెల్లిస్తానని, తన భూమి తనకు రిజిస్టర్ చేసివ్వాలని ప్రాధేయపడ్డాడు. ససేమిరా కాదని ఆయన చెప్పడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాధితుడు వెంట తెచ్చుకున్న క్రిమిసంహారకమందును సేవించి అక్కడే అపస్మారక స్థితిలోకెళ్లాడు. దీన్ని గమనించిన స్థానికులు 108 ద్వారా అతన్ని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అతని పరిస్థితి విషమంగా మారడంతో అక్కడి వైద్యులు తిరుపతి రుయాకు తరలించారు. ప్రస్తుతం బాధితుని పరిస్థితి విషమంగా ఉందని, అతని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

బస్సులో ప్రేమికుడి వీరంగం


రోడ్డుపై పడి ఉన్న మందుబాబు

పలమనేరు: బస్సులో ఎక్కి పూటుగా మద్యం సేవించి నానా హంగామా చేసి ప్రయాణికుల వద్ద దెబ్బలు తిన్న యువకుని వ్యవహారం మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతిలో కర్ణాటక ఆర్టీసీ రాజహంసలో బస్సు ఎక్కి ఓ 26 ఏళ్ల యువకుడు బెంగళూరుకు టికెట్ తీసుకున్నాడు. బస్సు కొంతదూరం కదలగానే పూటుగా మద్యం సేవించాడు. బంగారుపాళెం వచ్చేసరికి కిక్కు ఎక్కువై 'నా లవర్ మోసం చేసింది' అంటూ కేకలు వేస్తూ ప్రయాణికులను ఇబ్బంది పెట్టాడు. ఎంత చెప్పినా వినకపోవడంతో అతన్ని ప్రయాణికులు చితకబాదారు. విధిలేక కండక్టర్, డ్రైవర్లు అతన్ని పలమనేరులోని అంబేడ్కర్ సర్కిల్‌లో బస్సు నుంచి దించేశారు. దీంతో రెచ్చిపోయిన ఆ యువకుడు ఐలవ్‌యూ అంటూ గట్టిగా అరుస్తూ జనంపైకి మట్టిని చల్లడం ప్రారంభించాడు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులు అదుపు చేసేందుకు యత్నించినా లాభం లేకపోయింది. దీంతో అక్కడున్న స్థానికులు అతనిపై నీళ్లు పోసి మత్తు దింపారు. అదే బస్సులోకి అతన్ని ఎక్కించారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించం


మాట్లాడుతున్న సీపీఎం నేత సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: నగర అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని, అఖిలపక్షం, పలు ప్రజా సంఘాల నేతలు హెచ్చరించారు. తిరుపతి అభివృద్ధి వేదిక కన్వీనర్ టి.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సోమవారం యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తిరుపతి అభివృద్ధిని అడ్డుకోవడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం టీటీడీ ఏడీ బిల్డింగ్ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. 500 కోట్ల ఆదాయం, 1000 కోట్ల టర్నోవర్ ఉన్న ఏ సంస్థ అయినా సామాజిక ప్రయోజనాలు కాపాడేందుకు తమ ఆదాయంలో రెండు శాతం నిధులు అభివృద్ధికి కేటాయించాలని 2013లో కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిందని, ఆ చట్టానికి లోబడి రెండు శాతంలో ఒక శాతాన్ని తిరుపతి మున్సిపాలిటీకి ఇవ్వడం అధర్మం ఎలా అవుతుందని వారు ప్రశ్నించారు. సీపీఎం నేతలు టి.సుబ్రమణ్యం, వేణు, మల్లికార్జునరావు, చిన్న, బాలాజీ, గంగులప్ప, చంద్రశేఖర్, జనసేన నేత మునస్వామి, బీఆర్ఎస్ నేత బెల్లంకొండ సురేష్, సురేష్, బీసీ సంరక్షణ సంఘం నేత నారాయణ పాల్గొన్నారు.

భక్తితో చేసే పనులు ముక్తిని ప్రసాదిస్తాయి


మాట్లాడుతున్న నిర్వాహకుడు ప్రవీణ్‌జైన్

తిరుపతి కల్చరల్: భక్తి శ్రద్ధలతో చేసే పనులు ముక్తిని ప్రసాదిస్తాయని తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. కపిలతీర్థం రోడ్డులోని ప్రేమ్‌దాస్ మందిరంలో జై అంబి సేవా మండల్ ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న నవరాత్రి వేడుకలు మంగళవారం విజయదశమి రోజున ఘనంగా ముగిశాయి. ఈ వేడుకల్లో హాజరైన మేయర్ మాట్లాడుతూ జై అంబి సేవా మండల్ ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా నవరాత్రి ఉత్సవాలు కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడం సంతోషకరమన్నారు. జై అంబి మండల్ నిర్వాహకుడు ప్రవీణ్ జైన్, నిర్వాహకులు రోషన్ పరెక్, సంపత్‌సోని, అరుణ్ సింగ్, హిమత్ సింగ్, రణ్వీర్ గెహ్లాట్, శ్యామ్ గెహ్లాట్, భవేష్, భవిక్ పాల్గొన్నారు.

హాకీ రాష్ట్ర జట్టుకు అభినందన


బాలుర హాకీ జట్టు

గూడూరురూరల్ : చెన్నైలో ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు హాకీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్ బాలుర హాకీ చాంపియన్‌షిప్‌లో ఏపీ జట్టు పుదుచ్చేరిపై విజయం సాధించి, మూడో స్థానం కైవసం చేసుకోవడంపై హాకీ సంఘం జిల్లా అధ్యక్షుడు టి.స్వర్ణస్‌రాజ్ అభినందనలు తెలిపారు. జట్టుకు ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. . ఈ మేరకు జట్టు విజయంపై హాకీ సంఘం ఏపీ చీఫ్ ప్యాట్రన్ ఎం.నిరంజన్‌రెడ్డి, అధ్యక్షుడు చాణక్యరాజ్, జనరల్ సెక్రటరీ హర్షవర్ధన్, ట్రెజరర్ పి.థామస్ పీటర్, కార్యదర్శి ఆదిత్య హర్షం వ్యక్తం చేశారు. జట్టుకు శిక్షణ ఇచ్చిన గూడూరు హాకీ కోచ్ దీపక్ ఆకాష్, పులివెందుల హాకీ కోచ్ రవి, మేనేజర్ ప్రకాశం రవి, జట్టు సభ్యులను ప్రశంసించారు.

ఆరు ద్విచక్ర వాహనాల దగ్ధం


కాలి బూడిదైన ద్విచక్ర వాహనాలు

కుప్పం: స్థానిక హెచ్‌పీ రోడ్డులోని ఓ మెకానిక్ షెడ్ వద్ద మంగళవారం ఆరు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. మంగళవారం దసరా పండుగ సందర్భంగా పట్టణం దుకాణాలను మూసివేశారు. ప్రజల రాకపోకలు తగ్గాయి. మెకానిక్ షెడ్ వద్ద పార్కింగ్ చేసి ఉన్న ఆరు ద్విచక్ర వాహనాల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగి కాలి బూడిదయ్యాయి. మంటలు అధికం కావడంతో చుట్టూ పక్కల ప్రజలు ఆర్పే ప్రయత్నం చేపట్టారు. అప్పటికే కాలి బూడిదయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించి ఉంటారని మెకానిక్ షెడ్ యాజమాని షయాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న గోపినాయుడు

గుడిపాల: చిత్తూరు–వేలూరు రోడ్డులోని సీఎంసీ ఆస్పత్రి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిత్తూరు ఒకటవ డిపో ఆర్టీసీ డ్రైవర్ గోపినాయుడు(50) తీవ్రంగా గాయపడ్డాడు. ఏఎస్‌ఐ చలపతి కథనం మేరకు.. చుక్కావారిపల్లె గ్రామానికి చెందిన గోపినాయుడు(50) సోమవారం ఉదయం డ్యూటీ ముగించుకుని ద్విచక్ర వాహనంలో వస్తుండగా, చిత్తూరు–వేలూరు రోడ్డులోని సీఎంసీ ఆస్పత్రి సమీపంలో టూరిస్ట్ బస్సు వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం చీలాపల్లె సీఎంసీకి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

మందుగుండు పేలి వ్యక్తి మృతి

బంగారుపాళెం: మండలంలోని గడ్డంవారిపల్లెలో సోమవారం రాత్రి మందుగుండు పేలి వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన కన్నయ్య కుమారుడు చిరంజీవి(43) అడవి పందులు వేటాడేందు కోసం మందు గుండు ఉండలను తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలడంతో ముఖానికి తీవ్ర గాయమై మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ నాగరాజారావు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి

తిరుపతి రూరల్ : తిరుపతి– చంద్రగిరి మార్గంలో పెరుమాళ్లపల్లె ఎస్వీ నగర్ వద్ద మంగళవారం రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఉదయ్‌శేఖర్‌రెడ్డి, కానిస్టేబుల్ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.


మహిళా వర్సిటీ కాన్వొకేషన్ నోటిఫికేషన్ విడుదల

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 21వ వార్షిక కాన్వొకేషన్ నోటిఫికేషన్‌ను వర్సిటీ అధికారులు విడుదల చేశారు. ఈ మేరకు వర్సిటీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను పొందుపరిచారు. 2022 విద్యా సంవత్సరం వరకు పీజీ, బీఈడీ, ఎంసీఏ, ఎల్‌ఎల్‌బీ, బీ.టెక్, బీ.ఫార్మసీ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థినులు వచ్చేనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.rpmvv.ac.in వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

కాలువలో వ్యక్తి మృతదేహం

చిత్తూరు అర్బన్: చిత్తూరు పెద్ద కాలువలో మంగళవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఇతని వయస్సు సుమారు 45 ఉండవచ్చు. వన్ టౌన్ ఎస్‌ఐ ప్రసాద్ కథనం మేరకు.. కట్టమంచి వివేకానంద విగ్రహం ఎదురుగా ఉన్న పెద్ద కాలువలో మృతదేహం ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు సాయికుమార్

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని శిరుగురాజుపాళెం గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక కామరాజ్‌నగర్‌కు చెందిన టి.సాయికుమార్(30) మృతి చెందాడు. ఏఎస్‌ఐ మార్కండేయులు కథనం మేరకు.. పుత్తూరు నుంచి స్కూటర్‌పై సాయికుమార్ తిరుపతి వైపు వెళుతున్నాడు. శిరుగురాజుపాళెం పెట్రోల్ బంకు వద్ద మలుపు వద్ద స్కూటర్‌ను సిమెంట్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పూర్ణాహుతితో ముగిసిన దసరా ఉత్సవాలు


పూర్ణాహుతి పూజలు చేస్తున్న పండితులు


పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద స్వామి, మాతాజీ ఆశీర్వచనాలు తీసుకుంటున్న ఎమ్మెల్సీ సిపాయి

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు సమీపంలో వెలసిన శ్రీశక్తిపీఠంలో మంగళవారం పూర్ణాహుతితో దసరా ఉత్సవాలకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా పీఠంలో కొలువైన శ్వేత వారాహి దేవికి, శ్రీమరకతశక్తి కాళీదేవికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, పట్టువస్త్రాలతో అమ్మవార్లను అలంకరించారు. అనంతరం పీఠం ప్రాంగణంలోని యాగశాలలో పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ స్వామి, మాతాజీ శ్రీరమ్యానంద భారతీ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి మేయర్ శిరీష పాల్గొని పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి, మాతాజీ శ్రీరమ్యానంద భారతీ ఆశీర్వచనాలు పొందారు.